# మరో షాజహాన్

యెలిశెట్టి శంకరరావు




రాత్రి ఎనిమిది అవుతూంది. రవివర్మ గదిలో అసహనంగా పచార్లు చేస్తున్నాను.

సాయంత్రం రవివర్మకూ, నాకూ మధ్య జరిగిన సంభాషణ మనసును తొలిచేస్తూంది.

నేనే ఓడిపోతానా?

"తాజమహల్ కంటే గొప్ప ప్రేమ మందిరాన్ని మీరు సృష్టించగలరా?" ఎంత అణచుకుందా మన్నా హేళన నా ప్రశ్నలో తొంగి చూసింది.

"తప్పకుండా! తాజమహల్ కంటే విలువైన స్మారక చిహ్నాన్ని నిర్మించి, నా మల్లిని చరిత్ర పుటల్లోకి ఎక్కిస్తాను." దృఢంగా చెప్పాడు రవివర్మ.

"బెట్!"

"చాలెంజ్!"

"ఏంటి?" కుతూహలంగా నా ప్రశ్న.

"నా లైఫ్?" నిశ్చలంగా అన్నాడు రవివర్మ.

నాలో సన్నగా వణుకు.

అసలేం చేస్తాడు రవివర్మ?

కొన్ని కోట్ల రూపాయలు, కొన్ని సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎన్నో ఒడిదుడుకుల కోర్చుకుని నిర్మించిన తాజమహల్— షాజహాన్ తన ప్రియురాలు ముంతాజ మహల్ స్మారక చిహ్నంగా నిర్మించిన అపురూప కళా సౌందర్యపు సోగు.

రవివర్మ అంతకంటే ఉన్నతంగా తన మల్లి కోసం ఎలాంటి కళాఖండాన్ని సృష్టించగలడు? అసలేం చేస్తాడు?

చెదురు మదురుగా నన్ను పెనవేసుకున్న గతం! చిందర వందరగా ముసురుతున్న ఆలోచనల తెమ్మెర!!

• • • •

'ప్రకృతిలో అందాన్నంతా హృదయంలో బంధించి ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో వెదజల్లాడా రవివర్మ!' క్షణకాలం పులకరించింది నా మనసు.

'రవివర్మ! నిజంగా రవివర్మ అంతటి గొప్ప చిత్రకారుడే!' మనసులో అభినందించకుండా ఉండలేక పోయాను. వరుసగా చిత్రాలన్నీ చూసు కుంటూ నడుస్తూ 'ప్రశాంతి' అన్న చిత్రందగ్గర ఎందుకో ఆగిపోయాను.

"వయ్యారంగా ప్రవహిస్తూన్న జలపాతం, పచ్చని ప్రకృతి ఒడిలో పడుచు జంట. ఆదిమ వాసులూ కారు. ఆధునికులూ కారు. మిశ్రమ నాగరికతా చాయలు చిత్రంలో గోచరిస్తున్నాయి. స్త్రీ, పురుషు లిద్దరి మొహాల్లోనూ విపరీతంగా వెల్లి విరిస్తున్న ఆనందం, సంతోషం, కళ్ళలో వెలుగు స్పష్టంగా ద్యోతక మవుతున్నాయి.

ఏ యాంగిల్‌లో చూసినా నాకు ఆ రంగుల చిత్రంలోని అంతరార్థం అర్థం కాలేదు. ఈ చిత్రం గీసిన రవివర్మ తప్ప మరెవరూ ఇన్నర్ మీనింగ్ చెప్పలేరేమో అనిపించింది. నేను ఆలోచ నల్లో ఉండగానే...

"అతనే రవివర్మ! ఈ బొమ్మలన్నీ అతను వేసినవే!" ఎవరో నడివయసాయన పక్కను న్నామెతో చెప్తున్నాడు. నేను చటుక్కున అటువైపు దృష్టి సారించాను.

పాతికేళ్ళ వయసు గల యువకుడు—బాల్కనీలో నిలబడి లాన్‌లో గాలికి అందంగా తలలూపుతున్న తెల్ల గులాబీల వంక తదేకంగా చూస్తున్నాడు.

నెమ్మదిగా అతన్ని సమీపించాను. నా రాకను గమనించ లే దతను.

"నమస్తే!" చేతులు జోడించి పలకరింపుగా నవ్వాను. చటుక్కున నా వైపు తిరిగా డతను.

'నమస్తే!' చిన్నగా తలవంచి కళ్ళతోనే నవ్వాడు. అతని నీలి కళ్ళు కరుణతో నిండి ఉన్నాయి.

'నా పేరు భారతి. ఆంధ్రా యూనివర్శిటీలో సోషల్ వర్క్‌ ఎమ్మే డిగ్రీ తీసుకున్నాను. మీ చిత్రాలన్నీ నాకు చాలా బాగా నచ్చాయి." పరిచ యం చేసుకుంటున్నట్టుగా నవ్వాను.

"మీ పరిచయం కలగటం సంతోషంగా ఉంది. భారతిగారూ!బై ది బై థాంక్స్‌ఫర్ ది కాంప్లిమెంట్." ప్రసన్న వదనంతో అన్నాడు రవివర్మ.

"మీ 'ప్రశాంతి' అన్న చిత్రంలో మీనింగ్ నాకు అర్థం కాలేదండి. నాగరికమూ, అనాగరికం కాని మధ్య వాతావరణ ప్రకృతిని ఎందుకు సృష్టించారు? ఆ చిత్రంలో జంట ప్రేమికులేనా? కళ్ళలో ఆ సంతృప్తి లైఫ్‌లో ఏ స్టేజిలో సాధ్య పడుతుంది?" ప్రశ్నలు కురిపించాను.

"మనిషికి ఎడ్యుకేషన్, సివిలిజేషన్ ఎక్కువ అవు తున్న కొద్దీ సెన్సిటివ్‌గా మారుతున్నాడు. రొటీన్ ప్రాబ్లమ్స్‌తో పాటు సైకలాజికల్ ప్రాబ్లమ్స్ కూడా పెరుగుతున్నాయి. అలా కాకుండా భవుతిక అవసరాలు మాత్రమే గుర్తించి మానసిక దౌర్బల్యాలకు ప్రాధాన్యత ఇవ్వనంత వెనక్కి వెళ్ళి పోతే అక్కడ ప్రేమ, శాంతి కలసిన జీవిత రహదారి ప్రశాంతంగా ఉంటుందన్న వూహ ఆధారంగా వేసిన వూహా చిత్రం."

రవివర్మ వివరణ అర్థం కాలేదు నాకు.


"మానసిక అవసరాలు గుర్తించకపోతే ప్రేమ అనే భావన ఉండేది కాదు కదండి!" సూటిగా ప్రశ్నించారు.

"నో! నో! అలా కాదు. మనసుల్లో ఏరే కాంప్లెక్స్‌లూ లేని...ఏ విజన్ వారే విధమైన సమ స్యలూ డామినేట్ చెయ్యలేని ప్రశాంత దివ్య రసానుభూతి. ఆడమ్ అండ్ ఈవ్, రాధాకృష్ణుల అనురాగవాహిని తరంగాల్లో ప్రేమ, ప్రశాంతి లేదన గలరా?" నవ్వుతూ ప్రశ్నించాడు రవివర్మ.

అతనికి సమాధానం చెప్పగలిగేనంత పరిణిత మనస్కురాల్ని కాదనిపించింది.

"మీ రెక్కడ చదువుకున్నారు?" సంభాషణ మళ్ళిస్తూ ప్రశ్నించాను.

"మాస్కో ఓపెన్ యూనివర్శిటీ నుంచి ఫైన్




ఆర్ట్ డిప్లమో, స్కల్ప్చర్‌లో మాస్టర్ డిగ్రీ తీసుకున్నాను" చెప్పాడు రవివర్మ.

"మా ఇంటికి మీరోసారిరావాలి."ఆహ్వానించాను.

"వీలైనప్పుడు తప్పకుండా వస్తాను."మృదువుగా చెప్పాడు.

సెలవు తీసుకుని నడుస్తూ ఎందుకో ఆగి వెనక్కి తిరిగి చూశాను. ఏదో విషాద దృశ్యాల్ని చూస్తున్నట్టు మళ్ళీ అతను తన పాత ఆలోచ నల్లో మునిగిపోయి గార్డెన్‌లోకి చూస్తున్నాడు.

* * * *

పది పదిహేను రోజులు గడిచాక సాయంత్రం షికారుగా వెళ్తుంటే ఎత్తైన అశోక వృక్షాన్ని ఆను కుని ప్రకృతిని పరీక్షగా వీక్షిస్తూ కన్పించాడు రవివర్మ. కనుచూపు మేరవరకూ పరుచుకున్న పచ్చని పొలాలు, ఇటు పక్క కలువపూలు పరుచుకున్న సరస్సులో అస్తమిస్తున్న సూర్యుని బంగారు రంగు కిరణాలు పరావర్తనం చెంది పాల రాతితో మలిచిన రోమన్ శిల్పాంలో నిలుచున్న రవివర్మను తాకుతున్నాయి. చేతి వేళ్ళ మధ్య కాలు తున్న సిగరెట్టు విషాద గీతికను ఆలాపిస్తున్న సన్నాయి వాయిద్యంలా అలలుగా గాలిలో కలిసిపోతూ పొగ మేఘాలు శూన్యంగా మారుతూంది.

క్షణకాలం అతన్ని తదేకంగా చూస్తే అతని కళ్ళలో అంతర్గతంగా గూడు కట్టుకున్న బాధ లీలగా నా కన్పించింది. ఇంత చిన్న వయసులో అతన్ని ఆశ్రయించుకున్న విషాదం ఏమిటి? ఆలోచన లోలోపలే అణిచేసి విష్ చేశాను.

"వెరీ గుడ్ ఈవినింగ్!" నవ్వుతూ పలకరిం చాడు.

"పచ్చని ప్రకృతి మధ్య పడుచుపిల్ల నిలబడితే వనకన్య అంటాం? మరి మిమ్మ ల్నేమనాలి?"

"రవివర్మ అనండి చాలు." అతని పెదవులు నవ్వాయి—కళ్ళు కాదు. అతని నీలి కళ్ళలో అంతర్గ తంగా మెరుస్తున్న విషాదపు పొర. ఎందుకో నా హృదయం ఒక్క క్షణం విలవిల్లాడింది.

సూర్యుడు పడమటి కొండల వెనక్కి జారి పోయాడు. గూళ్ళకు చేరుకుంటున్న పక్షుల రొద తప్ప అంతా నిశ్శబ్దం.

"మీరేమీ అనుకోకపోతే నే నో విషయం అడగా లనుకుంటున్నాను." గూడు కట్టుకున్న మౌనాన్ని ఛేదించాను.

"అడగండి!" నిర్లిప్తంగా అన్నా డతను.

"అఫ్‌కోర్స్! మన మధ్య ఎక్కువ పరిచయం లేకపోవచ్చు! ఇది పూర్తిగా మీ పర్సనల్ మేటర్ కావచ్చు. మీ అభిమానిగా మీ శ్రేయస్సును కాంక్షించటంలో తప్పులేదనుకుంటున్నాను. మీలో మీరే ఎందుకో బాధపడుతున్నట్టు నా అనుమానం... ఏమిటది! నాతో పంచుకోకూడదా?" నెమ్మదిగా అడిగాను.

తమాషాగా నవ్వాడతను. "నేను బాధ పడు తున్నానని ఎందుకనుకున్నారు?"

మై గుడ్ నెస్! అత నేమీ అనుకోలేదు. అవకాశం దొరికింది కదా చిన్న స్పీచ్ ఇవ్వాలి. "ఆ మాత్రం

తెలుసుకోలేనా? సోషల్ వర్కర్‌ని. మానవ స్థితి గతుల్ని పరిశీలించి, మనుషుల్ని జాగృతం చేసి మనసుల్ని చైతన్యవంతం చెయ్యటమే మంచి సోషల్ వర్కర్ విధి!'' వరల్డ్ సోషల్ వెల్ఫేర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లా పోజు పెట్టి చెప్పాను.

''సంఘ మానవ శ్రేయస్సు కోసం మీరు చేస్తున్న కృషికి ధన్యవాదాలు, మేడమ్!'' నవ్వుతూ తమాషాగా అన్నాడతను.

''ఉఁ! టాపిక్ డైవర్ట్ చేస్తున్నారు మీరు?'' వారించాను.

క్షణంసేపు మౌనంగా ఉండిపోయి—''గతంలో జ్ఞాపకాలు నన్ను బాధించవు, భారతీ! పైగా అవి నాకు మిగిలిన తీపి గుర్తులు!'' గంభీరంగా అన్నాడు రవివర్మ.

అతని కళ్ళలో వేదన కరుగుతుందేమోనని




భయం వేసింది నాకు. టాపిక్ నేనే డైవర్ట్ చేశాను.

''కొత్తగా ఏదైనా చిత్రం వేస్తున్నారా?''

''వూఁ'' ఎటో చూస్తూ చెప్పాడు రవివర్మ.

''ఏమిటది?'' అడిగాను.

''లవ్!'' నిర్లిప్తంగా అన్నాడు.

''ఏమిటీ? పార్వతీ—దేవదాసూ, లైలామజ్నూ లాంటి మరో ఇద్దరు గొప్ప ప్రేమికుల్ని సృష్టిస్తున్నారా?'' కుతూహలంగా అడిగాను.

చటుక్కున నావైపు సూటిగా చూసి అన్నాడతను.

''మనం హ్రస్వ దృష్టితో చూస్తే కేవలం రెండు జీవితాలకు మాత్రమే సంబంధించిన ప్రేమను కాకుండా—'అందర్నీ, అన్నిటినీ ప్రేమించు' అనే కొత్త పదం వైపు చూడగలగటానికి మన వ్యవస్థకి ఎంతకాలం పడుతుంటావు భారతీ.''

నా నారో మైండెడ్‌నెస్‌కి నాకే సిగ్గేసింది.

చాలాసేపు ఏమీ మాట్లాడలేకపోయాను. తరవాత నేనే అడిగాను—''మా ఇంటికెప్పుడొస్తారు?''

''నా కెలాగూ రావటానికి వీలయ్యేటట్టు లేదు: మీరే మా ఇంటికి రావచ్చు గదా?'' అడిగాడు రవివర్మ.

నా కెందుకో సంతోషం వేసింది.

''థాంక్యూ: మీ ఆహ్వానాన్ని పురస్కరించుకొని ఎప్పుడో మీ ఇంటికి వచ్చేస్తాను.'' ఉత్సాహంగా అన్నాను.

చిక్కని చీకటి ముసురుకున్న ఆకాశంలో అప్పుడే పొడుచుకొచ్చిన చంద్రుడు ఫక్కున నవ్వాడు.

• • • •

ఆరోజు రాత్రి డైనింగ్ హాల్లో భోజనాలు చేస్తుండగా డాడీ నాతో చాలాసేపు మాట్లాడారు.

''భారతీ! చదువు పూర్తి చేశావు. ఇక నీకు పెళ్ళి చేసేద్దామనుకుంటున్నాను. అఫ్‌కోర్స్! చాలా సంబంధాలొస్తున్నాయి. బట్... నాకు కొడుకువైనా, కూతురివైనా నువ్వే. మీ అమ్మ ఉంటే నీ ఇష్టా ఇష్టాల్ని స్వేచ్ఛగా చెప్పుకోగలిగి ఉండేదానివి. బట్ ఉయ్ ఆర్ అన్‌లకీ. ఎనీహౌ! నేను ఇంత వరకూ జీవితంలో నీ కే లోటూ రానివ్వకుండానే పెంచాను. అఫ్‌కోర్స్ ఇక మీదట రానివ్వను కూడా! అయినా నీ ఫ్రీడమ్‌కి నేను అడ్డు రాదలుచుకోలేదు. నీది మెచ్యూర్డ్ బ్రెయిన్ అనే నా నమ్మకం. పెళ్ళి విషయంలో నువ్వు సొంతంగా నిర్ణయం తీసుకోదల్చుకుంటే నాకేం అభ్యంతరం లేదు. ఆర్ అదర్‌వైజ్ ఆరేంజ్‌డ్ మేరేజ్‌కి ను వ్విష్టపడేటట్టయితే నేను కలుగజేసుకుని ఏర్పాటు చేయిస్తాను. చాయిస్ ఈజ్ యువర్స్!''

డాడీకి ఏం చెప్పాల్సి వచ్చినా ఫ్రాంక్‌గా, సూటిగా చెప్పటం అలవాటు. ఆయన సమాధానం కోసం నా వైపు చూస్తున్నారు.

''థాంక్యూ, డాడీ! నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వండి'' అన్నాను.

''ఓ. కే... ఓ. కే! టేక్ యువర్ ఓన్ టైం.'' నా వైపు వాత్సల్యంగా చూస్తూ అన్నా రాయన.

నిజానికి నే నింత వరకూ పెళ్ళి గురించి ఆలోచించనే లేదు. 'నా క్కాబోయే భర్త ఇలానే ఉండాలి' లాంటి అందమైన కలలు నాకు చాలా దూరంగా ఉంటాయి. ఎందుకంటే మనిషి ప్రాక్టికల్‌గా బతకాలి. కలల్లో విహరించకూడదనేది నా ప్రిన్సిపల్. డాడీ నా పెళ్ళి ప్రస్తావన తెచ్చేసరికి నా మనసులో మెదిలిన ఒకే ఒక వ్యక్తి రవివర్మ!

రవివర్మను నేను అభిమానిస్తాను. ఒక ఆర్టిస్టుగా గౌరవిస్తాను. అతనో పెళ్ళి ప్రసక్తి ఎత్తేంత చనువూ లేదు, పరిచయమూ లేదు. రవివర్మను లైఫ్ పార్ట్‌నర్‌గా ఎందుకు ఎంచుకోకూడదు? నా అంచనా నిజమైతే కళాకారుల్లో చెడ్డవాళ్ళు అంటూ ఉండరు. అయినా అతన్ని కనీసం ఒక సంవత్సరం బాగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి—ఈ నిశ్చయానికి రాగానే నిశ్చింతగా నిద్రపోయాను.

మరునాటిరోజు డాడీని నా పెళ్ళి విషయంలో ఒక సంవత్సరం టైమడిగాను. ఆయన సరేనన్నారు.

• • •

ఆ వారంలో ఒకరోజు సాయంత్రం రవివర్మ ఇంటికి వెళ్ళాను. సాదరంగా రిసీవ్ చేసుకున్నాడు.

విశాలమైన హాల్లో నిలువెత్తు తైలవర్ణచిత్రాలు మనోహరంగా ఉన్నాయి. ఇద్దరం డ్రాయింగ్ రూములోకి నడిచాం.

చిత్రంగా అక్కడున్న ప్రతి వర్ణ చిత్రంలోనూ 'వనకన్య' పోలికలతో ఒకే అమ్మాయి నవ్వుతూంది. జలపాతం ఒడ్డున అర్ధనగ్నంగా స్నానం చేస్తూ, అడవి మధ్యలో జింక పిల్లలతో వూసులాడుతూ—ప్రతి చిత్రంలోనూ ఆ అమ్మాయి కళ్ళలో అమాయకత్వం, అందం అతి సహజంగా చిత్రించాడు రవివర్మ. వాటి కోసం అతను చాలా శ్రమించాడని వాటిని చూస్తేనే అర్థమవుతూంది.

నేను తదేకంగా వాటిని చూస్తూ ''ఎవ రీ అమ్మాయి? మోడల్ గర్లా?'' ప్రశ్నించాను.

అతను కాదన్నట్టు తలూపాడు.

''ఏదో కొత్త చిత్రం వేస్తున్నారు. పూర్తి అయిందా?'' అడిగాను.

''అమ్మేశాను. ఒక అమెరికన్ టూరిస్టు లక్ష రూపాయలకు కొనుక్కున్నాడు.'' నిర్లిప్తంగా చెప్పాడు రవివర్మ.

''మై గుడ్‌నెస్: మీ ప్రేమను అమ్మేసుకున్నారన్నమాట. కనీసం ఈ వనకన్య బొమ్మలయినా అమ్మకుండా దాయండి. చాలా అందంగా ఉన్నాయి.'' అనాలోచితంగా అనేసిన తరవాత అతని వైపు

చూసి తడబడ్డాను.

దెబ్బతిన్నట్టు చూస్తున్నాడు రవివర్మ. అతని కళ్ళలో అప్రయత్నంగా మెదిలిన కన్నీటిపొర, 'భారతీ!' విస్మత్నవుగా గొణిగా డతను.

విచలిత మనస్కనై నన్ను నేనే నిందించు కున్నాను.

"సారీ... ఐయామ్ వెరీ సారీ: ఇఫ్ ఎనీథింగ్ రాంగ్ విత్ మీ, ప్లీజ్ ఎక్స్‌క్యూజ్ మీ." నెమ్మదిగా అన్నాను.

అత నేం మాట్లాడలేదు. తదేకంగా వనకన్య చిత్రంవైపే చూస్తున్నా డతను. అతని కళ్ళలోంచి జారుతున్న నీటి బిందువులు.

"రవివర్మా! ప్లీజ్ కంట్రోల్ యువర్‌సెల్ఫ్: అయామ్ సొ సారీ." అతని భుజం మీద చెయ్యి వేసి చెప్పాను.

"ఇట్సాల్ రైట్.,.డోంట్ మైండ్!" విషాదంగా నవ్వా డతను.

• • • •

ఆ తరవాత కొన్నిరోజులు రవివర్మను చూడ టానికి గిల్టీగా ఫీలయ్యాను. చాలారోజుల తరవాత ఆరోజు అతన్ని చూడటానికి వెళ్ళాను. బెడ్‌రూంలో ఏదో పుస్తకం చదువుకుంటూ కనిపించాడు. 'మే ఐ కమిన్'' గుమ్మం దగ్గర నిలిచి అడిగాను.

నన్ను చూడగానే అతని మొహం వికసించింది.

"ష్యూర్: ష్యూర్: కమిన్ ప్లీజ్" ఆహ్వానిం చాడు.

లోపలికి నడిచాను.

"ఏమిటి కనిపించడం లేదు." మందహాసంతో అడిగా డతను.

"వూరికినే మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యటం ఇష్టం లేక." గొణిగాను.

"అంతేనా: లేక ఈ మానియాక్‌ని చూసి భయపడ్డారా?" నవ్వుతూ ప్రశ్నించా డతను.

"నో..నో:" ఖంగారుగా చెప్పాను.

అప్పుడు పరీక్షగా చూశా నతని గది. గోడలన్నీ ఖాళీగానే ఉన్నాయి. ఏ గోడకూ ఒక్క చిత్రం కూడా లేదు.

"ఆశ్చర్యంగా ఉందే—ప్రఖ్యాత చిత్రకారుడు రవి వర్మ బెడ్‌రూంలో ఒక్క సుందర దృశ్యం కూడా లేదంటే రియల్లీ ఇట్ ఈజ్ ఇన్‌క్రెడిబుల్." ఆశ్చర్యంగా అన్నాను.

"వూహు. ఎప్పటికైనా ఒ మాస్టర్‌పీస్ చిత్రం ఇక్కడుంచాలి. ఆ చిత్రం తప్ప మరేది ఇక్కడ చోటు చేసుకోకూడదు." నిశ్చయంగా అన్నాడు రవివర్మ.

"ఏమిటంత స్పెషాలిటీ: ఆబ్జెక్ట్ ఏం తీసుకుంటారు?" అడిగాను,

"నా హృదయం!" చెప్పిన రవివర్మ కళ్ళలో కాంతి.

నా హృదయంలో తియ్యని వూహ ప్రవేశించింది. నా గుండె క్షణ కాలం లయ తప్పింది.

"యూ మీన్ యువర్ హార్ట్...: అంటే?" అమాయకంగా ప్రశ్నించాను.

"మీరు చూశారు కదా? వనకన్య చిత్రంలో ఉన్న అమ్మాయే: పేరు మల్లి" చెప్తున్నప్పుడు రవివర్మ కళ్ళు చిత్రంగా మెరిశాయి. విచిత్రంగా నన్నేదో నిస్పత్తువ ఆవరించుకుంది. చాలాసేపు నిశ్శబ్దం తరవాత హీనస్వరంతో అడిగాను.

"మల్లి ఇప్పుడెక్కడుంది?"

సమాధానంగా అతని స్వరంలో విషాదం కురిసింది.


"లేదు: భువుతికంగా ఈ ప్రపంచంలో లేదు."

* * * *

సెన్సిటివ్‌నెస్, సెంటిమెంట్స్ అమాయకత్వం మూర్తీభవించిన కళాకారుడు రవివర్మ. అతన్ని పెళ్ళి చేసుకుంటే జీవితం ప్రశాంతంగా గడిచి పోతుందనే నిర్ణయానికి నేను వచ్చేసరికి మా స్నేహానికి సంవత్సరం వయసొచ్చింది.

* * * *

ఆ రోజు కార్లో రవివర్మ నేను రామతీర్థం హిల్స్ చూడడానికి బయల్దేరాం.




ఎత్తైన రాతి కొండలు మనిషి అస్తిత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఒక పక్క మామిడితోపులు, ఒడ్డును ఒరుసుకుంటూ గలగలా పారుతున్న సెల యేటి సంగీతం. మధ్య నల్లని తారురోడ్డు పొచ్చిన అమ్మాయిలా మెలికలు తిరుగుతూ గారతీరాలనో తాకాలని తహతహలాడు తుంది.

ఇద్దరం మామిడి తోటలో కూర్చున్నాం. సెల యేటి మీద నుంచి వీస్తున్న చల్లగాలి శరీరాల్ని సేద తీరుస్తోంది. ఆరోజు రవివర్మతో పెళ్ళి ప్రసక్తి తీసుకు రావాలని ఆరాటపడ్డానే గాని, సంభాషణ ఎలా మొదలుపెట్టాలో నాకు తెలియలేదు. మనసులోని మాట సూటిగా అడగటానికి చాలా బిడియపడ్డాను. వాతావరణాన్ని తేలిక పర్చి ఎవరికీ బాధ లేకుండా సూటిగా అడిగెయ్యాలని నిశ్చయించుకున్నాను.

"రవిగారూ! ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ ఆనందకరమైన ప్రకృతి మధ్య ఒక అందమైన మైన ఆడగిల్ల సహోజ...నేనే మిమ్మల్ని ప్రేమిస్తున్నాను... అంటే? మీరేమంటారు?

అతను నా వైపు సూటిగా చూశాడు. క్షణం తరవాత—

"రెండూ చేతులూ ఎత్తి దండం పెట్టి, తల్లీ! నీ కో దండం నన్నొదిలీ. మై హార్ట్ ఈజ్ ఆల్‌రెడీ ఫిల్డ్ విత్ లవ్, ఎండ్ నా ఇటీజ్ బీటింగ్ విత్ హెర్ మెమరీస్... అంటాను." నవ్వుతూ చెప్పాడు.

"ఫరవాలేదు. మీకూ సెన్సాఫ్ హ్యూమరుందే!" స్పోర్టివ్‌గా అన్నా. ఎందుక్ నా హృదయం బాధగా మూలిగింది. చెదిరిన తియ్యని వూహల్లో నేను ఒంటరిగా మిగిలి ఉండగా—"భారతీ!" అతని స్వరం వినిపించింది.

నేను తలెత్తి అతని వైపు చూశాను.

"భారతీ! నువ్వు నాకు మించి స్నేహితురాలిగా మిగిలి పోతావా?" అభ్యర్థనగా అడిగా డతను. నే నేం మాట్లాడలేదు.

"భారతీ! ని న్నెప్పుడూ నేను ప్రేరేపించ లేదు. నాకు తెలియకుండానే నేను నీలో అలాంటి ఆలోచన్ని రేకెత్తిస్తే నన్ను క్షమించు." అతని కంఠం రుద్ధమయింది.

"పరవాలేదు. స్పెసిఫిక్‌గా లైఫ్ ఇలా, ఇలా ఉండాలని కలలు కనే ఇల్యూజనిస్ట్‌ను కాను. లైఫ్ ఎలా ఎదురైనా తట్టుకోగల రియలిస్టుని. సొ! ప్లీజ్ డోంట్ వర్రీ ఎబౌట్ మీ." నవ్వాను. నా నవ్వులో జీవం లేదని నాకు స్పష్టంగా తెలుస్తోంది.

బాధగా నిట్టూర్చి అతను చెప్పటం ప్రారంభించాడు. అతని స్వరం మందంగా గాలిలో వ్యాపిస్తోంది.

"మల్లి నా జీవితంలో అందమైన కల, భారతీ! నాలుగు సంవత్సరాల కిందట ఒక రోజు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య అధినేతల్ని గడగడలాడించిన వన్య విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు సంచరించిన ప్రాంతంలో ఆ పుణ్య పురుషుడి

చిత్రాన్ని గీయాలని చింతపల్లి అడవికి వెళ్ళాను.

ఒక పక్క అతని అనుచరుల సమాధులు, మరో పక్క వీరోచితమైన అతని స్మృతుల్ని జ్ఞప్తికి తెచ్చే భీకరమైన ప్రకృతి, మరో పక్క ఆహ్లాదకరంగా జలపాతాలు. అక్కడ అతని చిత్రం గీయాలని ఇన్‌స్ట్రుమెంట్స్ అన్నీ సిద్ధం చేసుకుని రోజుకు కొంత భాగంగా చిత్రం వేస్తుండే వాడ్ని. అప్పుడే నాకు మల్లి పరిచయ మయ్యింది. అక్కడికి నాలు గైదు మైళ్ళ దూరంలో ఉన్న గిరిజన గూడెం అమ్మాయి. అనాగరికమైన అలంకరణలలో, కల్మషం లేని మనసు, దయతో నిండిన కళ్ళు వనకన్య నడిచి వచ్చి నా ముందు నిలిచి నట్టుండేది. నేను చిత్రం వేస్తున్నంత సేపు కన్నులు అరమోడ్చి కుతూహలంగా చూసేది. మధ్య మధ్య తేనె, అడవి పళ్ళు, మంచినీరు అందిస్తూ అలిసిన నన్ను సేద దీర్చేది. భారతీ! యూ నో ఇట్ మే బి ఎఫెక్షన్, ఇంటిమసీ—ఆర్ ప్లెటోనిక్ లవ్...ఐ డోంట్‌నో వాట్ ఇటీజ్. బట్ ఆమె అమాయకమైన మాటలు నన్నాకర్షించి ఆకట్టు కున్నాయి. యు నో, భారతీ! ప్రేమ అమాయకత్వం నుంచే పుట్టాలి. మనిషి మనిషికీ మధ్య అంతస్తులు, ఐశ్వర్యాలు, కీర్తి, పలుకుబడి, డబ్బు ఇవన్నీ లెక్కలు కట్టుకునేమనుషులు ఒకర్నొకరు ఎప్పటికీ ప్రేమించు కోలేని యంత్రాలు. మల్లిని నేను ఆరాధించే వాడ్ని.

సీతారామరాజు చిత్రం పూర్తవుతుండగా ఆ రోజు నేను చాలా శ్రద్ధగా ఫైనల్ టచెస్ ఇస్తున్నాను. మల్లి నా పక్కనే నిలబడి రంగుల కలయిక, కొత్తగా సంతరించుకుంటున్న రూపం అన్నీ కుతూహలంగా, విచిత్రంగా చూస్తోంది. ఆ సమయంలో ఒక నాగుపాము నా పాదం పైన కాటేసి చరచరా పొదల్లోకి పాకి పోయింది. నేను కింద పడిపోయాను. శరీరం అంతా బాధగా, హృదయాన్ని ఎవరో మెలితిప్పు తున్నట్టు ఫీలయ్యాను. ఆ క్షణంలో మల్లి నా కాళ్ళ దగ్గర కూర్చుని కాటుతిన్న నా పాదంలో విషాన్ని నోటితో లాగేసింది. బట్ టు మై అన్ ఫార్చ్యూన్ ఆ విషం ఆమెలో ప్రవేశించి నా మల్లి నా కళ్ళ ముందే చాలాసేపు నరకంఅనుభవించి కళ్ళు మూసింది. ఆ క్షణంలో నేనైనా చచ్చిపోలేదే అని గుండె లవిసేలా ఏడిచాను. భారతీ! నన్ను రక్షించటానికి ఆరాటపడ్డ నిమిషంలో నా మల్లి కళ్ళలో కదలాడిన తపన, ఆరాటం, ఆవేదన, ఆరాధన ఎన్ని జన్మలకయినా ఎలా మరిచిపో గలను? ఆ ప్రేమ మూర్తిని నా హృదయంలో ప్రతిష్ఠించుకుని నా బతుకుని ఎన్నో ఆనందాలు నింపుక వాలని ఎన్ని కలలు కన్నానో నీ కెలా చెప్పను, భారతీ!'' అతని స్వరం విషాదంగా పలుకుతూంది. అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

ఫ్రాంక్‌గా చెప్పాలంటే అతని కన్నీటినిచూస్తుంటే నాకు జాలితోపాటు మల్లి మీద అసూయకూడా కలిగింది. నా ఆలోచనల్ని అణగ దొక్కి అనునయంగా అడిగాను.

''మల్లిని మరిచిపోలేరా?''

''మల్లిని మరిచిపోతే ఇక నా జీవితానికి అర్థ మేమిటి, భారతీ?'' జాలిగా అడిగా డతను.

''పోయిన వాళ్ళతో మనమూ పోగలమా? గుండె నిబ్బరం చేసుకోవాలి. కొత్త జీవితాన్ని ప్రారంభించ

# దృష్టిభేదం

**బీర్బల్ కు** పొగాకు నమిలే అలవాటుండేది. అక్బర్ మహారాజుకు ఇది మహా రోతగా ఉండేది. ఒక రోజు వారిద్దరూ వాహ్యాళికై బయలుదేరి వెళ్తుండగా, ఒక పొగాకు తోట వద్ద ఒక గాడిద కనిపించింది. తోటలో ఉండి కూడా అది ఆ పొగాకు ఆకుల్ని నమలకుండా ఉండిపోయింది.

అక్బర్ బీర్బల్ వంక తిరిగి ''చూశావా, బీర్బల్, గాడిదలు కూడా ఆ దరిద్రపు పొగాకును ముట్టుకోవడం లేదనేది గమనించావా?'' అన్నాడు.

బీర్బల్ మృదువుగా సమాధానం చెప్పాడు: ''నిజమే, మహారాజా. గాడిదలైతేనే పొగాకు ముట్టుకోవు.''

**-ప్రసీల్**

డానికి ప్రయత్నించాలి.'' అనునయంగా అన్నాను.

''నా వల్ల కాదు, భారతీ!'' అశాంతిగా అన్నాడు రవివర్మ.

''షాజహాన్ ముంతాజుమహల్ కోసం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఒక పాలరాతి ప్రేమమందిరాన్ని అపురూపంగా ఆమె స్మృతుల కర్పించాడు. కొన్ని శతాబ్దాల పాటు అతని ప్రేమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. మరి మీరో? చరిత్ర పుటల్లోకి ప్రవేశించగలరా? మానవ జాతి చరిత్రలో మీ ప్రేమ ఏ మూలయినా చోటు చేసుకోగలదా?'' కావాలనే వ్యంగ్యంగా, హేళనగా అడిగాను.

అతని కళ్ళు నిర్మలంగా నవ్వాయి.

''షాజహాన్ ప్రేమలో గొప్పతనం నాకు కనిపించదు భారతీ! అతను కళాపిపాసి కావచ్చు. కాని, ముంతాజ్ మహల్‌మీద ప్రేమ అతని ఏచర్యలో ద్యోతకమయింది? కొన్ని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని, శ్రామిక శక్తిని కొల్లగొట్టి తన ప్రియురాలి స్మారక చిహ్నంగా తాజమహల్‌ని నిర్మించే హక్కు అతని కెవరిచ్చారు?'' ఆవేశంగా అన్నాడు రవివర్మ.

''ఏం! తాజమహల్‌కంటే గొప్ప ప్రేమమందిరాన్ని మీరు సృష్టించగలరా?'' ఎంత అణుచుకుందా మన్నా నా ప్రశ్నలో హేళన తొంగి చూసింది.



''తప్పకుండా! తాజమహల్ కంటే విలువైన స్మారక చిహ్నాన్ని నిర్మించి ప్రేమమయిగా మల్లిని చరిత్ర పుటల్లోకి ఎక్కిస్తాను!'' దృఢంగా చెప్పాడు రవివర్మ.

''బెట్'!'

''ఛాలెంజ్!''

''ఏంటి?'' కుతూహలంగా నా ప్రశ్న.

''నా లైఫ్!'' నిశ్చలంగా అన్నాడు రవివర్మ. నాలో సన్నగా వణుకు.

''సరే! నా దృష్టిలో తాజమహల్ కంటే మరో గొప్ప కళాఖండాన్ని మీరు సృష్టించ లేకపోతే, నేను చెప్పినట్టు మీ భవిష్యత్తును మీరు తీర్చి దిద్దుకోవాలి! సరేనా?'' షరతు చెప్పాను.

''ఓ. కే!'' లేచా డతను నవ్వుతూ.

ఇద్దరం కార్లో కూర్చున్నాం. కారు రవివర్మ ఇంటివైపు పరిగెత్తింది.

• • • •

రాత్రి తొమ్మి దవుతూంది. ఆలోచనల్లోంచి తేరుకుని పచార్లు ఆపుచేసి సోఫాలో కూర్చున్నాను. షాండిలీర్ కాంతి ఆగదిని ప్రకాశింప జేస్తోంది.

స్టాండ్‌లో ఫిక్స్ చేసి ఉన్న బోర్డు మీద దృష్టి కేంద్రీకరించి ఆలోచిస్తున్నాడు రవివర్మ. పక్కనున్న ట్రేలోకుంచెలు, రంగులు, పెన్సిళ్ళు ఉన్నాయి.

రెండు గంటల పైగా అలా ఆలోచన్లో ఉండి పోయి తరవాత స్కెచ్ గీయటానికి ఉపక్రమించాడు. కొంచెం సేపు చూసిన తరవాత నేను అలసటగా నిద్రలోకి ఒరిగి పోయాను.

ఒక గంట రెండు గంటలు గడిచిం తరవాత ఎందుకో నాకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. టైము చూశాను. ఒంటి గంటవుతూంది.

రవివర్మ చిత్రం ముందు నిలబడి పెయింట్ చేస్తున్నాడు. చిత్రం వైపు తదేకంగా చూశాను.

తాజమహల్ చిత్రం గీసి దానికంటే ఉన్నతంగా చాలా ఉన్నతంగా మల్లి బొమ్మ గీశాడు. మల్లి కళ్ళు తాజమహల్‌ని చూసి పరిహాసంగా నవ్వుతున్నాయి.

రవివర్మ తదేకంగా, దీక్షగా పెయింట్ చేస్తున్నాడు. అతని మొహం పీక్కుపోయింది. మొహం నిండా స్వేద బిందువులు అలుముకున్నాయి.

అప్పుడు చూశాను స్పష్టంగా.

కెవ్వున నా గొంతులోంచి రాబోయిన అరుపు గొంతులోనే ఆగిపోయింది. నా మొహం చెమటల్లో కమ్మింది.

రంగులు కలుపుకునే ట్రేలో చాకుకి అంటిన రక్తం లైట్‌కాంతికి మెరుస్తోంది.

తెల్లని అతని ఛాతీ ఎడమ భాగం ఛేదించబడి ఉంది. ఎర్రటి రక్తం ధారగా కారుతూ, నేలమీద పడుతున్న రక్తం ప్రియురాలి నుదుట ప్రియుడు దిద్దిన సింధూరపు బొట్టులా ఉంది.

అతను ఛాతీ మీద గాయం లోని రక్తంలో కుంచె ముంచి మల్లి చిత్రానికి రంగు వేసి అలంకరిస్తున్నాడు.

''రవివర్మా! నువ్వు గొప్ప ప్రేమ పిపాసివి!'' నాలో నేనే గొణుక్కున్నాను.

భయంతో, అలసటతో, ఓటమితో నా కళ్ళు మూతలు పడ్డాయి. *